పంప్‌హౌస్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

తేలని 'సిండికేట్' లెక్కలు...

అధికార పార్టీ నేతల్లో లుకలుకలు

పెట్టుబడులైనా వెనక్కు వస్తాయో.. లేదోనని గుబులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికారపార్టీలో మద్యం సిండికేట్ లెక్కలు తేలడం లేదట. దీంతో భాగ స్వామ్యుల మధ్య లుకలుకలు మొద లయ్యాయి. ఎప్పటికి ఈ లెక్కలు తేలుస్తారోనని ఎదురు చూస్తున్నారు. ఎని మిది నెలలుగా భాగ స్వామ్యులకు మద్యంవ్యాపా రం లోని లెక్కలు తేల్చకపోవడంతో ఏమి జరుగుతున్నదోనన్న గుబులు కొందరిలో నెలకొన్నట్లు సమాచారం. దీంతో ఆ పార్టీ నేతల మధ్య అంతర్గత తగాదాలకు దారితీస్తున్నట్లు చర్చ నడుస్తోంది.

లాటరీ తరువాత సిండికేట్

రాష్ట్రంలో 2024లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం విధానంలో మార్పులు తీసుకొచ్చింది. అంతక మునుపు ప్రభుత్వం ద్వారానే మద్యం వ్యాపారం నడిచేది. ఈ విధానం కాదని గతేడాది అక్టోబరు మాసంలో కొత్త విధానాన్ని ప్రకటించింది. ప్రయివేటు వ్యక్తుల ద్వారానే లాటరీ పద్ధతిలో మద్యం అమ్మకానికి లైసెన్సులను జారీ చేసింది. ఇందులో పెద్దఎత్తునే వ్యాపారులు లైసెన్సుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఆ సమయంలోనే సిండికేట్ ద్వారా దరఖాస్తులు వేసుకోవాలని ప్రయత్నించినా కొంత పోటీ అయితే కొనసాగింది. లాటరీ అనంతరం లైసెన్సులు వచ్చాక సిండికేట్ జరిగింది. అధికారపార్టీ ముఖ్య నేతలకు సంబంధించిన దుకాణాల లైసెన్సులు వచ్చిన చోట పట్టించుకోనప్పటికీ కొత్తవారికి ఇతరులకు వచ్చిన చోట మాత్రం తమకు భాగస్వామ్యం ఇవ్వాలనిగాని, తమ వారికి భాగస్వామ్యం ఇవ్వాలన్న పేరుతో చాలా దుకాణాలను తమ పరిధిలోకి తీసుకున్నారు. ఒక్కో వ్యక్తి నుంచి పది లక్షల రూపాయల నుంచి రూ.25 లక్షలు ఇలా అనేక స్థాయిలో వాటాలిచ్చి భాగస్వామ్యులుగా చేసుకున్నారు.

ఎనిమిది నెలలుగా తేలని లెక్కలు

భాగస్వామ్యం కలుపుకుని దుకాణాలు నడిపేందుకు అంగీకారం కుదుర్చుకున్నారు. అయితే భాగస్వామ్యులకు ఏ నెలకు ఆ నెల వ్యాపార లాభనష్టాల లెక్కలు మాత్రం చూపడం లేదట. దీంతో భాగస్వామ్యులుగానున్న అధికారపార్టీ నేతల మధ్య విభేదాలు కొనసాగుతున్నట్టు సమాచారం. లెక్కలు చూపండని అడిగితే ఏదో కారణంతో చూపకుండా దాటవేత ధోరణిని అవలంభిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ విభేదాల్లో భాగవే అనంతపురం నగరంలో అధికార పార్టీ నేతల మధ్య ఇటీవల పెద్ద వివాదం చోటు చేసుకున్నట్లు టిడిపిలో చర్చ నడుస్తోంది. రూ.90 లక్షల వరకు ఒక నాయకుడు పెట్టుబడి పెడితే ఇప్పటి వరకు లెక్కలు చూపకపోవడంతో ఇద్దరి మధ్య వివాదం చోటు చేసుకుంది. ఇది పెద్ద చర్చ కావడంతో పార్టీ అధిష్టానం వరకు సమస్య వెళ్లినట్టు తెలుస్తోంది. అయితే ఈ సిండికేట్ వ్యవహారం ఇంకా ఎంత వరకు పోతుందన్నది చూడాల్సి ఉంది.

వేతనాలు చెల్లించేవరకు సమ్మె ఆగదు

'శ్రీరామిరెడ్డి' కార్మికుల సమ్మెకు ప్రభుత్వమే కారణం

నిరసనలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం టౌన్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు వేతనాలు చెల్లించేదాకా సమ్మె ఆగదని, ఈ సమ్మెకు ప్రభుత్వమే కారణమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు అన్నారు.కళ్యాణదుర్గం శ్రీరామిరెడ్డి పంప్‌హౌస్ వద్ద ఆదివారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, కోశాదికారి గోపాల్, శ్రీరామిరెడ్డి యూనియన్ నాయకులు రాము, నరేష్‌లతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే అనేక దఫాలు జిల్లా కలెక్టర్ చర్చలకు పిలిచినప్పటికి ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, రాయదుర్గం ఎమ్మెల్యే విప్ కాలవ శ్రీనివాసులు, జిల్లాకలెక్టర్ వినోద్‌కుమార్‌తో జరిగిన చర్చల్లో సుమారు రూ.5.50కోట్లు వేతన బకాయిలు ఉన్నాయని ముగ్గురం రాష్ట్ర ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లి నిధుల విడుదలకు కృషిచేస్తామని హామీ ఇచ్చారనిచెప్పారు. 77 రోజులుగా సమ్మె చేస్తున్న పాలకులు, అధికారులు పరిష్కరించక పోవడం దురదృష్టకరమన్నారు. ఫేస్-1 కింద పనిచేస్తున్న కార్మికులకు ఆరు నెలల వేతనం, 12 నెలల పిఎఫ్, ఫేస్-4 కింద పనిచేసే కార్మికులకు 2023 నుంచి 2024 జనవరి వేతనం, 22నెలల పిఎఫ్ ఇవ్వాల్సుందన్నారు. పస్తులుండి కార్మికులు తాగునీటి పథకాన్ని నడిపారని ప్రభుత్వం వెంటనే వేతనాలు, పిఎఫ్ చెల్లించి ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటన్నింటిని పరిష్కరించేవరకు కార్మికుల సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

'పురం' వాణిజ్య సముదాయం వినియోగంలోకి వచ్చేనా..?

◆ ప్రారంభించి ఆరేళ్లు పూర్తి ◆ వృథాగా సముదాయ భవనాలు
◆ అడుగుపెట్టని వ్యాపారులు ◆ ఆదాయం కోల్పోతున్న పురపాలక సంఘం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా దాదాపు 9 ఎకరాల్లో హిందూపురం పట్టణ నడిబొడ్డున పురపాలక సంఘం వారు దాదాపు రూ.30 కోట్లు వెచ్చించి నూతన వాణిజ్య సముదాయం నిర్మించారు. వీటి పనులు పూర్తి కాక పోయినా అప్పటి,ఇప్పటి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 2019 మార్చి 7న వాణిజ్య సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం వైసిపి ప్రభుత్వంలో ఈ సముదారానికి కాస్తా మెరుగులు దిద్ది రెండో సారి ప్రారంభించారు. రెండు ప్రభుత్వాలు అట్టహాసంగా వాణిజ్య సముదాయాన్ని రెండుసార్లు ప్రారంభించి ఆరేళ్లు గడిచినప్పటికి నేటికీ పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదు. దీనికి ప్రధాన కారణం వ్యాపారులకు చెప్పిన విధంగా అక్కడ మున్సిపల్ అధికారులు సౌకర్యాలు కల్పించక పోవడమే. దీంతో వ్యాపారులు ఇక్కడ వ్యాపారాలు చేయడానికి సుముఖత చూపడం లేదు. గదులు అద్దెకు తీసుకున్న వారు 'కాసులు ఇచ్చుకో...షెట్టర్‌ను పెట్టుకో' అన్న చందంగా ...వారికి ఇష్టం వచ్చినట్లు గదులను పగల గొట్టి, షెట్టర్లను ఏర్పాటు చేసుకున్నారు. వారికి ఎవరు అడ్డు చెప్పలేదు. కొందరు తీసుకున్న గదుల్లో వారి వ్యాపారాలను ప్రారంభించలేదు. అద్దెకు తీసుకున్న గదులు ఖాళీగా ఉన్నాయి. దీంతో నెలకు లక్షల రూపాయల్లో పురపాలక సంఘం ఆదాయం కోల్పోతోంది.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఉన్న కూరగాయాల మార్కెట్ శిథిలావస్థలో ఉందని2016లో అప్పటి టిడిపి ప్రభుత్వం పడగొట్టి అదే స్థానంలో నూతనంగా అన్ని సౌకర్యాలతో సుమారు రూ.100 కోట్లతో కూరగాయాల మార్కెట్‌తో పాటు వాణిజ్య సముదాయం, చికెన్, మటన్, చేపలు, పూలు, పండ్లు ఇలా ప్రతి ఒక్కటి అక్కడే ప్రజలకు అందే విధంగా నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో పాటు అప్పటికే అక్కడ వ్యాపారాలు చేస్తున్న వారికి ప్రాధాన్యత ఇచ్చి ఎటువంటి గుడ్‌విల్ లేకుండా గదులు కేటాస్తామని చెప్పింది. అయితే రూ.100 కోట్లు కాదు కదా కనీసం రూ.50కోట్లతో కూడా మార్కెట్ నిర్మాణం చేపట్టలేక పోయింది. చివరకు ఎన్నికలు సమీపించడంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు, పురపాలక సంఘం రూ.3కోట్లు, గుడ్‌విల్ రూపంలో రూ.10కోట్లు మొత్తం రూ.23కోట్లతో మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇంకా పూర్తి కాక ముందే అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే బాలకృష్ణ చేతుల మీదుగా 2019 మార్చి 7న ఎన్నికల ముందు వానిజ్య సముదాయాన్ని ప్రారంభించారు. 2019 ఎన్నికల్లో టిడిపి అధికారం కోల్పోయింది. ఇక్కడ ఎమ్మెల్యేగా బాలకృష్ణ గెలచినప్పటికి ప్రారంభించిన మార్కెట్‌ను పట్టించు కోలేదు. అలా ప్రారంభించి రెండు సంవత్సరాలు గడిచినా మార్కెట్ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అనంతరం 2021లో అప్పటి మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాలక వర్గ సహకారం, అప్పటి నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ సూచన మేరకు మార్కెట్ అభివృద్ధికి పురపాలక సాధారణ నిధులు కేటాయించి మార్కెట్ నిర్మాణం పూర్తి చేశారు. దీంతో పాటు బహిరంగ వేలం పాట నిర్వహించారు. దీంతో పాటు కూరగాయల వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసి దానిని సైతం ప్రారంభించి, కూరగాయాలు, ఆకు కూరలు, పండ్లు, పూల వ్యాపారాలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూవచ్చారు. అయితే వాణిజ్య సముదాయంలో అవసరమైన సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించ లేదని ఆరోపిస్తు వ్యాపారులు వాణిజ్య సముదాయంలో తమ వ్యాపారాలు ఇంత వరకు ప్రారంభించలేదు.

మార్కెట్ స్వరూపం

మార్కెట్‌ను ఎ, బి అనే రెండు బ్లాకులుగా రెండు లక్షల చదరపు మీటర్ల పార్కింగ్ స్థలంతో రెండు అంతస్తుల్లో 321 గదులతో నిర్మించారు. ఎన్నికలు రావడం, టిడిపి ప్రభుత్వం ఓడిపోవడం మార్కెటు శాపంగా మారింది. చిన్నచిన్న పనులు పూర్తి చేసి గదులకు వేలం పాటలు నిర్వహించడానికి వైసిపి ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది. మార్కెట్లో సౌకర్యాల కల్పనకు వ్యాపారుల నుంచి వచ్చిన నిధుల్లో రూ.7 కోట్లు వరకు వెచ్చించింది. వ్యాపారం బాగా జరుగుతుందని, రెండు బ్లాకుల్లోని కింది అంతస్తులో ఉన్న 183 గదులను వ్యాపారులు ఏకంగా రూ.12 కోట్లు గుడ్ విల్ చెల్లించి తీసుకొన్నారు. అయితే వ్యాపారాల నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వ్యాపారం జరగక వారు లబోదిబోమంటున్నారు. తమ సొమ్ము వాపసు ఇవ్వాలని అధికారులను, నాయకులను కోరుతున్నారు. కింది అంతస్తులోనే వ్యాపారాలు జరగ కపోవడంతో పై అంతస్తులోని 138 గదులను తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. వ్యాపారాలు లేకపోవడంతో నెల రోజుల్లోనే తాము తీసుకొన్న గదులను వ్యాపారులు మూసివేశారు. ఈ నేపథ్యంలో మూడు సంవత్సరాలుగా మున్సిపాల్టీకి అద్దె చెల్లించడం లేదు. దీంతో మార్కెట్ అంతా ఖాళీగా మారింది. చివరకు అది మందు బాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

వాణిజ్య సముదాయంలో మద్యంపాకెట్లు, వాటర్‌బాటిళ్లు

2019లో వాణిజ్య సముదాయ భవన ప్రారంభ దృశ్యం

నిబంధనలు మరచిన అధికారులు

నూతన మార్కెట్, వాణిజ్య సముదాయం ప్రారంభ సమయంలో మున్సిపల్ అధికారులు వ్యాపారులకు మార్కెట్ చుట్టు రెండు కిలోమీటర్ల వరకు ఏలాంటి తోపుడు బండ్ల వ్యాపారాలు లేని విధంగా చూస్తామని చెప్పారు. అయితే ఈ నిబంధనలు అమలు చేయడంలో అధికారులు విఫలం అయ్యారు. మార్కెట్ ముందు తోపుడు బండ్ల వ్యాపారులు వ్యాపారాలు చేస్తుండడంతో మార్కెట్ లోపలికి ఎవరు రావడం లేదని, ఇప్పటికే వడ్డీలకు తీసుకొచ్చి పురపాలక సంఘానికి చెల్లించాల్సిన గుడ్‌విల్ చెల్లించామని, ఇంక పెట్టుబడి పెట్టి వ్యాపారాలు ప్రారంభిస్తే వ్యాపారాలు జరగక తెచ్చిన డబ్బులకు వడ్డీలు సైతం చెల్లించడం కష్టంగా మారుతుందని వ్యాపారాలు ఎవరు ముందుకు రావడం లేదు. మార్కెట్ ముందు ఉన్న తోపుడు బండ్లను ఖాళీ చేయించి, వ్యాపారులకు వేలం పాట సమయంలో చెప్పిన నిబంధనలు పాటిస్తే అన్ని వ్యాపారాలు ఒకే చోట ప్రారంభం అయ్యే అవకాశాలున్నాయి.

సౌకర్యాలు కల్పిస్తే షాపులు తెరవడానికి సిద్ధమంటున్న వ్యాపారులు

జిల్లా కేంద్రంగా హిందూపురం ఉంటుందని వ్యాపారులు లక్షలాది రూపాయలు గుడ్‌విల్‌గా పెట్టి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులను అద్దెకు తీసుకున్నారు. అయితే జిల్లా కేంద్రం రాలేదు. మున్సిపల్ అధికారులు వాణిజ్య సముదాయంలో అవసరమైన సౌకర్యాలు కల్పించ లేదు. దీంతో గదులు అద్దెకు తీసుకున్న వ్యాపారులు అద్దెలు చెల్లించ లేక గుడ్‌విల్ చెల్లించడానికి చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక నేడు రోడ్డున పడ్డారు. మున్సిపల్ అధికారులు వేలం సమయంలో గెజిట్‌లో పేర్కొన్న విధంగా సౌకర్యాలు కల్పిస్తే తామందరం వ్యాపారులు చేసుకొంటు, పురపాలక సంఘానికి చెల్లించాల్సిన అద్దెలు చెల్లిస్తామని వ్యాపారులు గత రెండు సంవత్సరాలుగా అధికారులు, పాలకుల చుట్టూ తిరుగుతూ విన్నవిస్తున్నప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదు. వాణిజ్య సముదాయం పూర్తి కాక ముందే 2019లో భవనాన్ని ప్రారంభించిన బాలకృష్ణ దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పిస్తే నెలకు రూ.18లక్షలు ఆదాయం

పురపాలక సంఘ అధికారులు, పాలక వర్గం నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయంలో, మార్కెట్‌లో వ్యాపారులకు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసి, పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తే పురపాలక సంఘానికి నెలకు సుమారు రూ.18లక్షలు ఆదాయం వస్తుంది. దీంతో పాటు మార్కెట్ కింద ఎటువంటి అనుమతులు లేకుండా పూల వ్యాపారులు వ్యాపారాలు చేస్తున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించి, వేలం పాట ద్వారా వారికి స్థలం కేటాయిస్తే మరింత ఆదాయం పెరుగుతుంది. ఈ విధంగా పాలక వర్గం, అధికారులు అడుగులు వేస్తే పురపాలక సంఘానికి ఆదాయం పెరుగుతుంది.

పరిశీలించి వినియోగంలోకి తీసుకొస్తాం



2019లో తాను మున్సిపల్ కమిషనర్‌గా పురంలో విధులు నిర్వహించే సమయంలో వాణిజ్య సముదాయ భవనాలను ప్రారంభించడం జరిగింది. ఇప్పటికీ పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదు. రెండో సారి ఇక్కడి కమిషనర్‌గా బాధ్యతలను తీసుకున్నాను. మార్కెట్‌ను పరిశీలన చేసి, అందరితో సమన్వయం చేసుకుని, ఉపయోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటా.

మల్లికార్జున,
హిందూపురం మున్సిపల్ కమిషనర్

1100 కాల్‌సెంటర్ సేవలు వినియోగించుకోండి

కలెక్టర్ టిఎన్. చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ టిఎస్ చేతన్ కోరారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదలైంది. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారులు ఇచ్చిన అర్జీలకు పరిష్కారం కాకపోతే ఈ టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి కనుక్కోవచ్చున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లాలోని ప్రజలు తమ అర్జీలను సమర్పించుకోవచ్చని చెప్పారు.ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ఫిర్యాదు స్వీకరించడం జరుగుతుందన్నారు. అలాగే మండల డివిజన్ మున్సిపాలిటీ పరిధిలో కూడా అర్జీలు ఆయా అధికారులు స్వీకరిస్తారని చెప్పారు.

కవులను ప్రోత్సహించడం అభినందనీయం

ప్రజాశక్తి-హిందూపురం

కనుమరుగు అవుతున్న తెలుగు సాహిత్యానికి జీవం పోస్తూ...యువ కవులను ప్రోత్సహిస్తూ, వారిని గుర్తించి పురస్కారాలను అందించడం అభినందనీయమని డీఎస్పీ మహేష్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో తపన సాహిత్య కార్యాలయంలో సడ్లపల్లి కథ పురస్కార కార్యక్రమం జరిగింది. శశికళ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఎస్‌పి మహేష్, తపన సాహిత్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు సడ్లపల్లె చిదంబరం రెడ్డి, డాక్టర్. పెద్దిరెడ్డి, డాక్టర్ యమున, డాక్టర్. ప్రగతి, మానవహక్కుల వేదిక యంయం. బాషా, జాబిలి చాంద్‌బాషా, కల్లూరు రాఘవేంద్ర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు సడ్లపల్లె చిదంబరం రెడ్డి మాట్లాడుతూఈ సంవత్సరం తెలుగు రాష్ట్రాల నుంచి కథలను ఆహ్వానించామన్నారు. ఇందులో చిత్తూరు జిల్లాకు చెందిన పలమనేరు బాలాజీ రాసిన "ఏకలవ్య ఎరుకల కాలనీ జీవన గాథలు" అనే పుస్తకానికి, తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన స్వర్ణ కిలారి రాసిన "నల్లబంగారం" అనే పుస్తకానికి "సడ్లపల్లె కథా పురస్కారాలు, కాకినాడకు చెందిన ప్రజా వైద్యులు డాక్టర్ యనమగల మురళీకృష్ణను సేవా పురస్కారానికి ఎంపిక చేసామన్నారు. హిందూపురం ప్రాంతంలోని ప్రజల సమస్యలు, ఇక్కడి సహజ ప్రజల నిత్యవ్యవహార పదజాలాన్ని బతికిస్తూ ఇక్కడి ఉనికిని దేశపు నలుమూలలా చాటడానికే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఎంపిక చేసిన వారిని అతిథులు ఘనంగా సన్మానించి, నగదు పురస్కారం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకుడు వెంకటరామిరెడ్డి, ఈశ్వర రెడ్డి, మానవత అమరనాథ రెడ్డి, పౌర హక్కుల సంఘం శ్రీనివాసులు, యువకవులు కైమలి, సిద్ధగిరి శ్రీనివాస్, డా. అశ్వత్థనారాయణ, గంగాధర్, ఆంధ్రరత్న గంగధర్, ఉమర్ ఫారూక్ ఖాన్, పులివెందుల మీసాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చే అదనపు నిధులతో గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోండి

జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటనారాయణ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఇచ్చే అదనపు నిధుల సాయంతో గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటనారాయణ సూచించారు. జిల్లాలో పలు లేఅవుట్లలో ఏడాది అయినా గృహ నిర్మాణాలు పూర్తి కావడం లేదు. గత వైసిపి ప్రభుత్వం లబ్ధిదారులకు పట్టణాల్లో అయితే ఒక సెంటు, గ్రామాల్లో అయితే ఒకటిన్నర సెంటు స్థలం కేటాయించింది. స్థల కేటాయింపులు కూడా పలుచోట్ల అనువుగాని చోట కొండ గుట్టలో మంజూరు చేయడంతో అక్కడ ప్రధానంగా నీరు, రహదారి తదితర సమస్యలతో పలువురు లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదు. దీంతో పలుచోట్ల గృహ నిర్మాణాలు నిలిచిపోయాయి. అయితే టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల హామీ మేరకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో అయితే రెండు సెంట్లు స్థలం కేటాయిస్తామని ప్రకటించింది. ఇప్పటికీ నిర్మాణాలు కానీ చోట చెప్పిన ప్రకారం స్థలం కేటాయిస్తామని చెప్పడంతో పాటు గత వైసిపి ప్రభుత్వం గృహ నిర్మాణానికి రూ. 1.80 లక్షలు కేటాయించగా ప్రస్తుత ప్రభుత్వం ఆ నిధులతో పాటు ఎస్సి, ఎస్టి, బీసీ వర్గాలకు అదనపు నిధులు మంజూరు చేస్తామని చెప్పడంతో గృహ నిర్మాణాల పనులు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో కొనసాగుతున్న గృహ నిర్మాణాలపై జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటనారాయణ పలు అంశాలను ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో వివరించారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని లేఅవుట్లలో ఎన్ని గృహాలు మంజూరు అయ్యాయి ?

జవాబు : జిల్లాలో పిఎంజివై అర్బన్, పిఎంఎవై గ్రామీణ ప్రాంతాలను కలిపి 297 లేఅవుట్లు ఉన్నాయి. వీటిలో 72,338 గృహాలు మంజూరు అయ్యాయి. ఇందులో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 30,987 గృహాలు, లబ్ధిదారుల సొంత స్థలాల్లో 36,257 ఇళ్లు మంజూరు అయ్యాయి. ఇందులో 27వేల గృహనిర్మాణాలు పూర్తి కాగా వివిధ దశలలో 32,608 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందుకు ప్రభుత్వం రూ.671 కోట్లు మంజూరు చేయగా మెటీరియల్ తో పాటు ఇతర బిల్లులు లబ్ధిదారులకు మంజూరు చేయడం జరిగింది.

ప్ర :-కూటమి ప్రభుత్వం అదనంగా మంజూరు చేసే నిధులు వివరాలు తెలపండి?

జ : ప్రభుత్వం కేటాయించే రూ. 1.80 లక్షల నిధులతో పెరిగిన ధరలు మేరకు గృహ నిర్మాణాలను బడుగు బలహీన వర్గాల వారు పూర్తి చేసుకోలేరని భావించిన కూటమి ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీకయితే రూ.75 వేలు మంజూరు చేస్తోంది. ఈ నిధులు ఎస్సీ, బిసి, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా సహాయం అందించడం జరుగుతుంది. ఈ అదనపు నిధులు లబ్ధిదారులు తిరిగి చెల్లించవలసిన అవసరం లేదు. లబ్ధిదారులు స్వయం సహాయక మహిళా సంఘాలలో సభ్యులుగా ఉంటే ఆ సంఘాల ద్వారా కూడా అప్పు పొందవచ్చు.

ప్ర: జిల్లాలో ఎప్పటిలోగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్న లక్ష్యం ఉందా?

జ : జిల్లాలో మంజూరు అయిన ఇళ్ల నిర్మాణాల్లో ఈ నెలాఖరులోగా 9984 గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్న లక్ష్యం ఉంది. ఇందులో 4500 గృహ నిర్మాణాలు పూర్తి అయ్యాయి. మిగిలిన వాటిని ఈనెలాఖరులోగా పూర్తి చేయాలన్న లక్ష్యంగా చర్యలు చేపట్టాం. పూర్తి అయిన గృహ నిర్మాణాలకు రూ.8 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. వాటిని లబ్ధిదారులకు అందిస్తున్నాం. మిగిలిన గృహాలు 2026 మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెలాఖరుకు మాకు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలనుకుంటున్నాము. ఎక్కడా బిల్లులు లబ్ధిదారులకు పెండింగ్‌లో లేవు. బహుశా ఈ నెలాఖరులో పూర్తి అయిన ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు ఉండవచ్చని భావిస్తున్నాం. ప్రభుత్వం సామూహిక గృహప్రవేశాలపై తగు నిర్ణయం తీసుకోవలసి ఉంది. కొత్తగా ప్రభుత్వం కేటాయించిన స్థలాలలో గ్రామీణ ప్రాంతాలలో అయితే మూడు సెంట్లు, అర్బన్ లో అయితే రెండు సెంట్ల స్థలంలో గృహ నిర్మాణాలు చేపట్టనున్నాం.

ప్ర: మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా ? గృహ నిర్మాణాల లబ్ధిదారులకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

జ : జిల్లాలో సిబ్బంది కొరత కొంతమేర ఉన్నప్పటికీ ఎక్కడా లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పనిచేస్తున్నాము. సిబ్బంది కొరతపై ప్రభుత్వానికి నివేదించాము. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేసి ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం. ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చు.

జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటనారాయణ

సమస్యల వలయంలో ఎన్టీఆర్ కాలనీ..!

ఏళ్లు గడుస్తున్నా కనీస సౌకర్యాలు కరువు
పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో కనీస వసతులు కరువై స్థానికులు సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క అలమటించిపోతున్నారు. కంకర తేలిన రోడ్లపై రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. ఇళ్లలో వినియోగించిన నీరు బయటకు పోయే దారి లేక అక్కడే రోజుల తరబడి నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళ ఇంటి నుంచి అడుగు బయట పెట్టాలంటే జంకుతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేదల కష్టాలను ఇటు ప్రభుత్వ యంత్రాంగం, అటు పాలకులు పట్టించుకోవడంలేదు. దీంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

మౌలిక వసతులకు కరువు

ఎన్టీఆర్ కాలనీ ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వం 130 గృహాలు మంజూరు చేసింది. 500కు పైగా జనాభా ఉంటోంది. కాలనీ ఏర్పడినప్పటి నుంచి మౌలిక వసతులు లేక కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. మౌలిక వసతులు కల్పించాలని పలుమార్లు అధికారులు, పాలకులకు మొరపెట్టుకున్నా స్పందించిన పాపాన పోలేదు. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా ఎన్టీఆర్ కాలనీ వాసుల ఇబ్బందులు మాత్రం మారడం లేదు.

తాగునీరు, రోడ్లు, డ్రైయినేజీ, విద్యుత్ సమస్యలతో సతమతం

కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి కూడా మట్టి రోడ్డు కావడంతో సాయంత్రం 6 గంటలు దాటితే మహిళలే కాదు, పురుషులు సైతం ఒంటరిగా వెళ్ల లేని దుస్థితి. జగనన్న కాలనీ, ఎన్టీఆర్ కాలనీకి బోయపేట నుంచి ప్రధాన రహదారిని సీసీ రోడ్డు వేశారు. అయితే అంతర్గతంగా సిమెంటు రోడ్లు, విద్యుత్ స్తంభాలు, డ్రైయినేజీ కాలువలు లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సత్యసాయి కాలేజీ మార్గం నుంచి కాలనీకి రావాలంటే అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొంది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడి కంకర తేలిన దారుల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లాలంటే నరకం చూడాల్సిందే.

రోడ్డుకు అడ్డంగా ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

విద్యుత్ స్తంభాల స్థానంలో కట్టెలు

ఎన్టీఆర్ కాలనీ పక్కనే ఓ ప్రయివేటు లేఅవుట్ కోసం విద్యుత్ లైన్ లాగారు. అయితే కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో కర్రల ఆధారంగానే వైర్లు లాగి కాలనీవాసులు ఇళ్లకు విద్యుత్ సౌకర్యాన్ని పొందుతున్నారు. ఇక దూరంగా ఉన్న ఇళ్లకైతే 100 నుంచి 200 మీటర్ల మేర వైర్లు కొనుగోలు చేయాల్సి ఉంది.

నీటి కోసం నానాతిప్పలు..

కాలనీలో నీటి వసతి కోసం పైపులైన్లు, సిస్టం ట్యాంకు ఏర్పాటు చేశారు. కాలనీ ఎదురుగా జగన్న కాలనీలో 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. ఈ ట్యాంకుకు వారం, పది రోజులకు ఓ సారి నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో కాలనీవాసులు నీటి కోసం యుద్ధాలు చేయాల్సి వస్తోంది. పట్టణంలో మున్సిపాలిటీ సిబ్బంది రెండు రోజులకు ఓ సారి నీటిని వదులు తున్నారని, అయితే అధికారులు ఎన్టీఆర్ కాలనీపై సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

కంకర తేలి గుంతల మయమైన ప్రధాన రహదారి

ఎన్టీఆర్ కాలనీ ముఖచిత్రం

మట్టి రోడ్లే దిక్కు..

కాలనీలో ప్రధాన రహదారితో పాటు వీధుల్లో మట్టి రోడ్లు వేశారు. ప్రస్తుతం ఈ రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. గుంతలు ఏర్పడి కంకర తేలి ఉండడంతో అడుగు తీసి అడుగు వేయాలంటే స్థానికులు భయపడుతున్నారు. దీనికి తోడు కాలనీలో టిప్పర్లు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్లపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇక చినుకు పడితే ప్రజలు ఇళ్ల నుంచి బయటికి వచ్చే పరిస్థితులు ఉండవు.

విద్యుత్ కష్టాలు..

కాలనీలో వీధి దీపాలు లేక రాత్రివేళ బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. కాలనీలో ముళ్ల పొదలు ఏపుగా దట్టంగా పెరగడంతో పాముల బెడద తీవ్రమైంది. విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు మున్సిపల్ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేటా తిరిగారు. దీంతో మూడేళ్ల క్రితం సంబంధిత అధికారులు వీధికి ఒక లైట్ చొప్పున నాలుగు లైట్లు మాత్రమే ఇచ్చి ఇళ్లకు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీధి లైట్లు వేస్తే విద్యుత్ బిల్లులు అధికంగా వస్తాయని భావించిన కాలనీవాసులు ఆ లైట్లను వినియోగించుకోకుండా వదిలేశారు.

ఎక్కడి మురుగు అక్కడే..

కాలనీలో రోడ్లు, డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలకు ఆవాసంగా మారుతోంది. వీటికి తోడు పిచ్చి మొక్కలతో ఆ ప్రాంతం అడవిని తలపిస్తోంది. కాలనీ పక్కన ఉన్న ప్రయివేటు లేఅవుట్‌కు ఏర్పాటుచేసిన కాలువకు కొందరు పైపులు వేసుకొని మురికి నీటిని వదులుతున్నారు. ఈ కాలువ మట్టి చెత్త చెదారంతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా కాలనీవాసులు రోగాలతో ఆసుపత్రుల చుట్టూ తిరుతుగున్నారు.

మౌలిక వసతుల కల్పనలో సవతి తల్లి ప్రేమ

ఎన్టీఆర్ కాలనీ ఏర్పాటు చేసినప్పటి నుంచి అధికారులు పాలకులు, కాలనీపై సవతి తల్లి ప్రేమ చూపుతున్నారు. కాలనీ ఏర్పాటు సమయంలో టిడిపి ప్రభుత్వం ఉన్నా కాలనీ అభివృద్ధికి నోచుకోలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం విస్మరించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- తిప్పన్న, ఆటో డ్రైవర్

సిమెంటు రోడ్ల నిర్మాణానికి నివేదికలు పంపాం

ఎన్టీఆర్ కాలనీలో అంతర్గత సిమెంటు రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. నిధులు మంజూరవ్వగానే పనులు ప్రారంభించి కాలనీ వాసుల సమస్యలు పరిష్కరిస్తాం. కాలనీలో వీధి లైట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- సతీశ్ కుమార్, నగరపంచాయతీ కమిషనర్

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం : పల్లె

ప్రజాశక్తి-కొత్తచెరువు

సమాజం అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని మాజీ మంత్రి, డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.వి.మాధవ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన పల్లె రఘునాథ్ రెడ్డి మాధవను సన్మానించారు. అనంతరం పల్లె మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికీ ఉద్యోగ విరమణ తప్పనిసరి అన్నారు. సమాజంలో ఉపాధ్యాయులకు ఎంతో గౌరవమైన స్థానం ఉందన్నారు. కావున ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని, విద్యార్థుల్లో మానవతా విలువలు పెంపొందించాలని సూచించారు. ఉపాధ్యాయునిగా మాధవ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ పూర్వ, ప్రస్తుత నాయకులు రాష్ట్ర, జిల్లా రఘురామిరెడ్డి, పాండురంగ వరప్రసాద్‌రావు, కె.అశోక్‌కుమార్, శ్రీనివాసులు, చంద్ర, నరసింహులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు పి.వి.మాధవను సన్మానిస్తున్న పల్లె

జాతరకు హాజరైన పల్లె

మండలంలోని లింగారెడ్డిపల్లిలో జరిగిన బొడ్డెమ్మ జాతరకు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరయ్యారు. గ్రామంలో పలువురు టిడిపి నాయకుల ఇంటికి వెళ్లి పలకరించారు. పల్లె వెంట నాయకులు ఎస్.శ్రీనివాసులు, మండల కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, చంద్ర, వెంకటేష్, శివప్రసాద్, శివారెడ్డి ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బొగ్గు నాగరాజు, జయకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జీవో-36, కనీస వేతనం అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిచో సమ్మెలోకి వెళ్లడానికి ఇంజినీర్ సెక్షన్ కార్మికులు సిద్ధంగా వున్నారని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 25వ తేదీ చేపట్టనున్న సమ్మెలో ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులు పాల్గొంటారని, ఎప్పుడైనా అత్యవసర సేవలు నిలిపి వేస్తామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, బాబు, కాటమయ్య పెద్దన్న యోగేష్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన యూనియన్‌నాయకులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పట్టణంలోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించా యి. శిల్పారామంలో హైదరాబాద్‌కు చెందిన రేణుక ప్రభాకర్ కళాకారుల బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారు. అన్నమయ్య కీర్తనలకు లయబద్ధంగా నాట్యం చేశారు. వారాంతపు సెలవు రోజైన ఆదివారం పట్టణ ప్రజలు, పరిసర గ్రామాల ప్రజల కోసం ఈ ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు శిల్పారామం ఏవో ఖాదర్‌వలి తెలిపారు. రేణుక ప్రభాకర్ శిష్యులు ప్రణతి, దేవిక, వేదిక, రితిక, సహస్ర, మేఘన, దీక్షిత, శ్రావ్య, బిందు, భార్గవి, తదితరులు చేసిన వివిధ కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. ఆటవిడుపుగా ప్రతి ఆదివారం ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ప్రేక్షకులు అభిప్రాయ పడుతున్నారు.

నృత్యం చేస్తున్న కళాకారులు

నిజాయితీ చాటుకున్న మహిళ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఓ మహిళకు రూ. 4 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగు రోడ్డుపై దొరకగా దానిని పోలీసుల ద్వారా సంబంధిత వ్యక్తికి అందజేసి నిజాయితీ చాటుకుందని డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని బీడీ ఫ్యాక్టరీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్న ఎం.ఇజ్రాయల్ అలీ గత శుక్రవారం బైక్‌పై వెళ్తూ స్థానిక వలిసాబ్ రోడ్డులో తన బ్యాగు పోగొట్టుకున్నాడు. ఆ బ్యాగు పట్టణంలోని జైన్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న విజయలక్ష్మికి దొరికింది. ఆమె బ్యాగు తెరిచి చూడగా అందులో బంగారు ఆభరణాలు ఉండడంతో పోలీసులకు అప్పజెప్పింది. దీంతో ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ బ్యాగుతో పాటు బంగారు ఆభరణాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎం.ఇజ్రాయిల్ అలీకి అందజేశారు. అలాగే విజయలక్ష్మి నిజాయితీని డీఎస్పీ, పోలీసులతో పాటు పలువురు ప్రశంసించారు.

పోలీస్‌స్టేషన్‌లో అలీకి బంగారు ఆభరణాలు అప్పగిస్తున్న డీఎస్పీ

'జానపద కళావైభవం' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి

'జానపద కళావైభవం' పోస్టర్ ఆవిష్కరణ

ధర్మవరం రూరల్ : రంగస్థల, నృత్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఆగష్టు 22వ తేదీ నిర్వహిస్తున్న 'జానపద కళావైభవం' పోస్టర్‌ను ఆదివారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. అంతకు ముందు ఆ సంఘం సభ్యులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి 'జానపద కళావైభవం-2025' ఆహ్వానపత్రికను అందజేశారు. వారు మాట్లాడుతూ రంగస్థల, సకల నృత్య కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆగష్టు 22వ తేదీ జానపద దినోత్సవం సందర్భంగా 2025 మంది జానపద కళాకారులతో మహబృంద నృత్యం (జానపద కళావైభవం) కార్యక్రమాన్ని అనంతపురం నగరంలోని పిటిసి గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి చేత 'జానపద కళావైభవం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెద్దిపోగు ఆనంద్, ఆర్.మానస, రమేష్, చంద్ర, కృష్ణ, తులసి పాల్గొన్నారు.

కురుబ సంఘం యువజన కార్యవర్గంలో తాడిమర్రివాసులకు చోటు

ప్రజాశక్తి-తాడిమర్రి

పార్థసారథి

కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు, రాష్ట్ర యువత అధ్యక్షుడు పాలెం కాటమయ్య, జిల్లా యువత అధ్యక్షుడు గిరక అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మదనపల్లెలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియమించిన జిల్లా కురుబ యువజన సంఘంలో మండలానికి చెందిన ముగ్గురికి చోటు కల్పించారు. వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా పిన్నదరి గ్రామానికి చెందిన గొంగటి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులుగా బ్యాల్ల పార్థసారథి, జిల్లా కార్యదర్శిగా కత్తి నాగభూషణంను నియమించారు. రమేష్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్న కురుబ సంఘం నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కురుబ సంఘం కోసం అనునిత్యం పని చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉండి న్యాయం చేస్తానని తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

గుడిబండ : రౌడీ షీటర్లు ఇకనైనా ప్రవర్తన మార్చుకుని, ప్రశాంత జీవితం గడపాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని పెనుకొండ డీఎస్పీ నర్సింగప్ప హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం డీఎస్పీ రౌడీషీటర్లతో సమావేశం నిర్వహించి కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ రౌడీ షీటర్లు గ్రామాల్లో గొడవలు, ఘర్షణలకు తావు లేకుండా శాంతియుతంగా మెలగాలన్నారు. అలా కాకుండా గ్రామాల్లో లేనిపోని గొడవలు, ఘర్షణలకు కారకులైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీతో పాటు మడకశిర సిఐ రాజకుమార్, గుడిబండ ఎస్ఐ రాజకుళ్లాయప్ప, ఎఎస్ఐ రమణ, కానిస్టేబుళ్లు ఉన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ నర్సింగప్ప

నేడు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని పందిపర్తి పొలంలో ప్రభుత్వ భూముల సాగుదారులకు, నక్కలగుట్టలో నివాసం ఉంటున్న పేదలకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న పిలుపునిచ్చారు. స్థానిక శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య అధ్యక్షతన సాగుభూములు, ఇళ్ల స్థలాల దరఖాస్తుదారులతో సమావేశం నిర్వహించి ఈ మేరకు తీర్మానం చేశారు. పెద్దన్న మాట్లాడుతూ ఈ విషయాలపై ఇప్పటికే పలుమార్లు విన్నవించడంతో పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టిని ఫలితం లేదని, ఇకపై సంఘటిత పోరాటమే మార్గమని పిలుపునిచ్చారు. కావున సోమవారం చేపట్టే ధర్నాలో దరఖాస్తుదారులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు బెస్త క్రిష్టప్ప, స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, జిల్లా కమిటీ సభ్యులు వడ్డే నాగభూషణ, ఆవాజ్ మండల అధ్యక్షులు మాబు, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు కుమ్మర కిష్టప్ప, కెవిపిఎస్ మండల నాయకులు గోవిందప్ప పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పేద ప్రజల ఆరోగ్యమే ఆలయ సంఘం లక్ష్యమని క్యాంపు ఛైర్మన్ డి.వి.వెంకటేశులు(చిట్టి) తెలిపారు. పట్టణంలోని తొగటవీధిలో వెలసిన శ్రీశాంతకళాచౌడేశ్వరీదేవి ఆలయ ఆవరణలో ఆదివారం శ్రీచౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో 112వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డి.వి.వెంకటేశులు, ఆలయ కమిటీ అధ్యక్షులు బంధనాదం రమణ మాట్లాడుతూ కొన్నేళ్లుగా పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలకు ప్రత్యేకంగా వైద్య చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ప్రతినెలా చివరి ఆదివారం వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. బంధనాదం నారాయణస్వామి జ్ఞాపకార్థం ఆయన భార్య లక్ష్మీదేవమ్మ, వారి కుమారులు వెంకటరమణ సోదరుల సహకారంతో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామ న్నారు. శిబిరంలో వైద్యులు వివేక్ కుళ్లాయప్ప, జయదీప్, పి.సతీష్‌కుమార్, ఎస్.విటల్, ప్రణయ్, వినయ్ సుమారు 300 మందికి వివిధ జబ్బులకు చికిత్స చేసి నెల రోజులకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. అలాగే ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరంలో ఆలయ కమిటీ కార్యదర్శి సిరివెన్నెల రాధాకృష్ణ, జి.ఆదినారాయణ, సహకార్యదర్శి బండి నాగరాజు, సభ్యులు మేకల శివయ్య, బండి ఆంజనేయులు, పెద్దకోట్ల విజయ్, పెద్దకోట్ల భాస్కర్, బండిసాయి, బండి ఫణి, బండి పవన్, సుశీలమ్మ పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఆర్‌డిటి(రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) విదేశీ నిధులకు సంబంధించి ఎఫ్‌సిఆర్‌ఎ(ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్)ను తక్షణమే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం శ్రీసాయి రూరల్ వికలాంగుల మండల సమైక్య ఆధ్వర్యంలో మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు విన్నవించారు. సమైక్య నాయకులు ఆదివారం పట్టణంలోని మంత్రి కార్యాలయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ ఆర్‌డిటి 50 ఏళ్లకు పైగా జిల్లాలో అనేక సేవలు అందిస్తుందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయక పోడంతో విదేశీ నిధులు ఆగిపోయాయ న్నారు. దీంతో ప్రజలకు అనేక సేవలు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. కావున కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయించాలని కోరారు. స్పందించిన మంత్రి తప్ప కుండా ఆర్‌డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయించేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద ఉన్న డాక్టర్ ప్లస్ ఫార్మసీ, క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం నగరానికి చెందిన త్రిభువన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మెగా వైద్య శిబిరాన్ని కదిరి రూరల్ సిఐ నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. డా. వికాస్ నరసింహ (ఆర్థో, స్పైన్ సర్జన్), డా. సుదర్శన్ (కన్సల్టెంట్ జనరల్ ఫిజిషియన్) సుమారు 200 మందికి వైద్య సేవలు అందించారు. రూ. 1,000 విలువ చేసే బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షను ఉచితంగా నిర్వహించి, ఎముకల బలహీనతపై అవగాహన కల్పించారు. అలాగే బీపీ, షుగర్, తదితర దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు చేసి సలహాలు, సూచనలు అందించారు. శిబిరంలో డాక్టర్ ప్లస్ ఫార్మసీ, క్లినిక్, త్రిభువన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సిఐ

అట్టహాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎంజిఎం ఉన్నత పాఠశాలలో 1986-1987లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒక్క చోట చేరి సందడి చేశారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం చేస్తున్న వృత్తులను, కుటుంబ సభ్యుల వివరాలను, యోగక్షేమాలను మాట్లాడుకున్నారు. తమ బ్యాచ్ లో ఎంతో మంది ప్రజాప్రతినిధులుగా, డాక్టర్, ప్రిన్సిపాల్, సైంటిస్ట్ గా ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డారని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఈ బ్యాచ్ కు చెందిన ప్రస్తుతం మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేష్ కుమార్‌ను మిత్రులందరు సన్మానించారు. అనంతరం పట్టణంలోని రూప వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ, ఎస్‌డిజిఎస్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర, సైంటిస్ట్ శ్రీనివాసులు, నరసింహులు, ఉల్కలప్ప, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు

7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

జులై 7వ తేదీ ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగ తెలిపారు. పట్టణంలోని సాయి ఆరామంలో ఆదివారం నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సురేష్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సమాజంలో అన్ని వర్గాల ప్రజల కోసం ఉద్యమం నడిచిందన్నారు. రాబోయే రోజుల్లో వర్గీకరణ ఫలాలను జాతి ప్రజలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కావన గ్రామ కమిటీలను జులై 7వ తేదీ లోపు పూర్తి చేయాలని సూచించారు. నూతన నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రతి మాదిగ గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బేకరీ గంగాధర్ మాట్లాడుతూ జాతి భవిష్యత్తు కోసం రాబోవు రోజుల్లో తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. సమావేశంలో నాయకులు మాతంగి తిప్పన్న, ఎస్‌టిడి నరసింహులు, పైపల్లి నరసింహులు, బండ్లపల్లి నరసింహులు, నాగభూషణం, కత్తి ఆనంద్, సాయి, రామయ్య పాల్గొన్నారు.

నల్లమాడలో మోస్తరు వర్షం

ప్రజాశక్తి-నల్లమాడ

మండలంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఉదయం నుంచి వేడి, ఉక్కపోతగా ఉన్న వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా చల్లబడింది. ఓవైపు ఎండ ఉండగానే మరోవైపు ఓ మోస్తరు వర్షం కురవడంతో వాతావరణం పూర్తిగా మారింది. అక్కడక్కడ కొద్దిపాటి వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖ తెలిపింది.

టిడిపి వార్డు కమిటీల ఎన్నిక

కదిరి టౌన్ : పట్టణంలోని 6, 13, 15వ వార్డులకు ఆదివారం టిడిపి నూతన కమిటీలను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ తెలిపారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు డైమండ్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో 13, 15 వార్డుల ఇన్‌ఛార్జిలు హరి, హైదర్ వార్డు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. వార్డు అధ్యక్షులుగా అయూబ్, జావీద్‌లను ఎన్నుకున్నారు. ఇర్ఫాన్ మాట్లాడుతూ ప్రభుత్వం చేసే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కాశీంవలి, నాయకులు గోపాల్, ఖలీల్, ఇలాహి, నౌషాద్, అలీఖాన్, పీట్ల రమణమ్మ, వంశీ, బాబ్‌జాన్, తదితరులు పాల్గొన్నారు.

మాంసం తరలిస్తున్న వాహనాలు సీజ్

హిందూపురం : హిందూపురం నుంచి బెంగళూరుకు మాంసం తరలిస్తున్న ఆరు వాహనాలను సీజ్ చేయడంతో పాటు 8 మందిని అరెస్టు చేసినట్లు హిందూపురం అప్ గ్రేడ్ స్టేషన్ సిఐ ఆంజనేయులు తెలిపారు. హిందూపురం ప్రాంతం నుండి పెద్ద ఎత్తున పెద్ద మాంసం బెంగళూరుకు తరలుతున్న పక్కా సమాచారంతో రూరల్ మండలం తూముకుంట వద్ద వాహనాలను తనిఖీ చేశామన్నారు. ఆరు వాహనాల్లో సుమారు ఐదు టన్నుల మాంసం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వాహనాలను స్వాధీనం చేసుకున్న వెంటనే పశువైద్యాధికారిణి నీరజ కుమారుని పిలిపించి పరీక్షలను నిర్వహించామన్నారు. మాంసం విలువ సుమారు రూ. 30 లక్షలు ఉంటుందన్నారు. నిర్ధారణ అనంతరం వాహనాలను సీజ్ చేసి, నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ కిందపడి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-రొద్దం

పొలంలో ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు రోటోవేటర్ కింద పడి విద్యార్థి మృతిచెందిన సంఘటన ఆదివారం మండలంలోని రాగిమేకలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. రాగిమేకలపల్లి గ్రామానికి చెందిన రైతు నారాయణరెడ్డి పొలంలో ఆదివారం ఉదయం అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని మహేష్ రోటోవేటర్ వేయడానికి వెళ్లారు. మహేష్‌తో పాటు ఆయన అన్న నరసింహ కుమారుడు క్రైలాస్(14) వెళ్లాడు. మహేష్ రోటోవేటర్ వేస్తుండగా క్రైలాస్ కదులుతున్న ట్రాక్టర్‌లో ఎక్కే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో అదుపు తప్పి రోటోవేటర్‌లో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు పొలం వద్దకు వెళ్లి పరిశీలించారు. క్రైలాస్ మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందించారు. క్రైలాస్ ధర్మవరం పట్టణంలోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడని, గత శనివారం స్వగ్రామం వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదం విషయం తెలుసుకొన్న స్థానిక టిడిపి నాయకులు బాషా, కంబాలపల్లి సర్పంచి మంజు విద్యార్థి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అంతర్రాష్ట్ర ఘరానా మోసగాడు అరెస్టు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

అంతర్రాష్ట్ర ఘరానా మోసగాడు మొత్తం 47 కేసుల్లో నిందితుడైన మొరంశెట్టి పాండును పోలీసులు అరెస్టు చేసినట్లు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇటీవల కొత్తచెరువులోని ధర్మవరం రోడ్డులో ఉన్న ఓ స్థలం విషయంలో చోటుచేసుకున్న వివాదానికి సంబంధించి పోలీసులు ఇప్పటికే 11మంది నిందితులను అరెస్టు చేశారన్నారు. ఆ కేసులో ప్రధాన సూత్రధారి అయిన దాల్ మిల్లు సూరి సోదరుడు మొరంశెట్టి పాండును ఆదివారం కర్నాటకలోని వైట్ ఫీల్డ్‌లో కొత్తచెరువు సిఐ మారుతిశంకర్, తన సిబ్బందితో కలిసి అరెస్టు చేశారన్నారు. పాండు పలు ఆర్థిక నేరాలకు పాల్పడుతూ వివిధ కేసుల్లో జైలు శిక్ష అనుభవించాడన్నారు. ఈ కేసులోని మిగిలిన ముద్దాయిలను త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన సిఐ, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. పాండును కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని నారనాగేపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు.. గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఆలయంలోకి ప్రవేశించి హుండీని పగలగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఆటుగా వెళ్లిన గ్రామస్తులు ఆలయంలో చోరీ జరిగినట్లు గుర్తించారు. హుండీలో రూ. 5వేలకు పైగా నగదు ఉండవచ్చని స్థానికులు తెలిపారు. కాగా మండలంలో ఇటీవల కాలంలో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని, పోలీసులు గస్తీ పెంచి చోరీలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.